

# పిటీ కప్ప

**డా॥ పులిపాటి గురుస్వామి**

***అలవాటు*** ప్రకారంగా క్లినిక్ మూసే ముందు డబ్బుల్ని లెక్క పెట్టుకుంటున్నాను.

"సార్ లోపలికి రావచ్చా" తొంగిచూస్తూ ఓ కప్ప. రమ్మని తల ఊపాను లెక్క పెట్టడం ఆపి.

**"ఏమనుకోకపోతే మీతో మాట్లాడాలని వచ్చాను. చాలా రోజుల్నించి అనుకుంటూ వున్నాను. కానీ తీరటం లేదు" అంది కప్ప.**

ఏదో ఆరాటంతో వుంది కప్ప. కాంపౌండరును, నర్సును పంపించేసి సరే చెప్పమన్నాను.

"ఇబ్బంది పెడుతున్నందుకు క్షమించాలి" అంది ఓరకంట చూస్తూ.

పైగా ఇదొక తంతు. సరే చెప్పమన్నాను.

"మీకు మంచి పేరుండటంవల్ల, మిమ్మల్ని చాలా రోజుల్నుంచి గమనించి మీ దగ్గరకు వచ్చాను".

మనుషుల్లానే పొగడ్తతో మొదలెట్టింది.

"అసలు విషయం చెప్పు" అన్నాను.

"దయచేసి మీరు విసుక్కోవద్దు. నా గాధ మీతో విన్నవిస్తాను. తగిన సలహా ఇవ్వండి" అంది.

ఇక నాకు తప్పేటట్టులేదు. చాలా తీరిగ్గానే వినదల్చుకొని ప్రారంభించమన్నాను.

"అయ్యా! మీకు తెలియందేముంది? మా కప్పలకు కాలం చెల్లింది. మీరు చూస్తుండగా బాల్యంలో ఏ కుంటలో చూసినా మేమే. ఏ కాల్వలో చూసినా మేమే. మీరు వాగుల్లో ఈతలు కొట్టిన కాలం మా బతుకు బంగారం. చేపపిల్లల్తో రొయ్యపిల్లల్తో దోస్తీ చేసుకుంట ఆనందంగా గడిపినం. వాగులు, వంకలు, నదులు అన్నింటా మేం సకల భోగాలు అనుభవించాం. కాలం అట్లానే కలిసొచ్చింది. వానలు పడ్డాయి. మా కడుపులు పండాయి.

మనుషుల దురదృష్టవెూ! మరి మాదో! చూస్తుండగానే కాలం ఎట్ల మారిపోయె. ఏండ్లకేండ్లు వానల్లేక, బావులు, కుంటలు, చెరువులు, కాల్వలు అన్నీ ఎండిపాయె. మా కప్పల జాతి 'నీళ్ళో రామచంద్రా' అనుకుంటూ ఎక్కడి కప్పలు అక్కడ్నే తిప్పలు పడుకుంట పురుగు బుస్సి తిని తినక ఎట్ల కాలం గడుపుతున్నమో దేవునికే ఎరుక.

ఏమీ దొరకని కప్పలు ఎండకు ఎండిపాయె. బండలకింద రాళ్లకింద శవాలైపాయె.

అయ్యా! 'ఉభయచరాల' మనే వరం ఒకటుంది కాబట్టి సరిపోయింది కాని లేకపోతే మా బతుకులు ఇంకా అధ్వాన్నం కాకపోవు? ఏదో గాలి పీల్చుకుంటూ గాల్లో తిరిగే పురుగుల్ని తినుకుంటూ బతికినం.

కొంతకాలం తర్వాత బతుకుమీద ఆశ చావక మా కుటుంబం గెంతుకుంటూ గెంతుకుంటూ హైదరాబాద్‌కు వచ్చిపడ్డం. రాజధాని నగరంలో హుస్సేన్‌సాగర్ మీద కన్ను పడ్డది మాకు. నా ముగ్గురు పిల్లలు, నేను మా ఆయన కొద్ది రోజులు హుస్సేన్‌సాగర్‌లో బాగానే బతికినం నాయనా. కొత్తగదా మంచిగనే అనిపించింది. నెల కాంగనే ఆ మురికినీళ్లల్లో ఉండబుద్ధి కాలేదు.

చూస్తుండగానే హుస్సేన్‌సాగర్ చుట్టూ అనేక పార్కులు వెలిశాయి. హోటల్లు వెలిశాయి. బోటింగు ఏర్పాటు చేశారు. పిల్లల ఆటలకోసం, పెద్దల సాయంత్రపు విహారాల కోసం అనేక ఏర్పాట్లు చేశారు. విపరీతమైన రద్దీ. అడపాదడపా వీళ్ల మలినాలన్నీ మా హుస్సేన్‌సాగర్‌లో కలుస్తూనే వున్నాయి. తట్టుకోలేకపోయాం.

ఇక పార్కుల్లోకి విహారానికి వచ్చిన మనుషుల ముచ్చట్లు విని, రకరకాల కుతతంగాలు, యువక దంపతులమధ్య అపనమ్మకపు యుద్ధాలు విని విని మాకు తిన్నది కూడ అరగకుంట అయ్యింది. బుద్ధున్ని చూసి మేం బుద్ధి తెచ్చుకున్నాం. ఎట్లైనాసరే ఇక్కడినుండి పోవాలనుకున్నాం.

ఎట్లా పోవాలె; ఎక్కడికి పోవాలె? ఒక్క వానలేదు. కనీసం మబ్బు లేదు. అదనంగా పక్కనున్న సెక్రటేరియట్ కంపు మొత్తం హుస్సేన్‌సాగర్‌లో చేరి రోజుకింత చావు మాకు దగ్గరౌతుంది.

"ఆగు ఆగు కప్పాజీ". మధ్యలో ఆపుతున్నందుకు ఏమీ అనుకోవద్దు. "ఆ ఆఫీసుల కంపు ఎప్పుడైనా వుండేదేకదా! కొత్తేముంది?"అన్నాను.

లేదు సారూ! ఈ రాష్ట్రంలోని వ్యవహారాల కంపు మొత్తం ఇక్కడే కదా మాట్లాడేది. ఇంతకు ముందు డ్రైనేజీల్లోంచే వచ్చేది. ఇప్పుడేమో నేరుగా ఆఫీసుల్లోనుండి చుట్టుపక్కలంతా గాల్లో వ్యాపించిపోతుంది. ఉభయచరాలం కదా! నీట్లో వున్నా అదే, ఒడ్డుకు చేరి బయట కూచున్నా అదే. ఈ మధ్యన ఇంత విపరీతంగా వ్యవహార కాలుష్యం బహిరంగంగా వ్యాపించడంచేత మేం అక్కడ ఉండలేకపోయాం.

ఇట్లా పోదామనుకునే సందిగ్ధంలోనే, కిందటి వినాయక చవితికి నిమజ్జనానికి చేసిన ఏర్పాట్లలో ఒడ్డుమీద వదిలిన ఓ గణేశుని కింద మా ఆయన నలిగిపోయాడు. ఒడ్డునుండి విసిరేసి ఓ గణేశుడు తగిలి ఓ కొడుకు ప్రాణం వదిలాడు. రెండోవాడు లాబరేటరీ డిసెక్షన్లకోసం కాంట్రాక్టర్ వేసిన వలలో చిక్కి వీరమరణం పొందాడు.

అట్లా నేను పోయినా బాగుండేది నాయినా. మిగిలిన ఆ ఒక్కకొడుకువల్ల నాకు అపకీర్తి వచ్చేటట్టుంది అంటూ కన్నీళ్లు పెట్టుకుంది. కాసేపటికి తల విదిలించి "బెకబెక" అంది కన్నీళ్ళు రాలిపడ్డాయి.

"డాక్టరుగారూ కొంచెం మంచినీళ్లు కావాలి" అంది.

ఓ మగ్గులో నీళ్లు అందించాను. చంగున అందులో దూకింది "ఆహా చాలా రోజులైంది శుభ్రమైన నీళ్లలో తడవక" అంటూ ముసిముసిగా ఆనందపడి నీళ్లు తాగి "అయ్యా! మీకేం తొందర లేదుగా?" అని ప్రశ్నించింది.

నాకు ఓ పక్కన ఒళ్లు మండుతుంది. సమాధానం చెప్పేలోపునే "మీ ఓపిక గురించి చాలా

విన్నాను. అందుకే నా బాధలు మీకు చెప్పుకోవడానికి సాహసించాను అంటూ చెంగున నీళ్ళలో నుండి బెంచీ మీదికి ఎగిరి కూచుంది.

అర్ధరాత్రి దాటుతుందన్న చిరాకు కొంచెం వున్నా నేను "సరే అసలు విషయం చెప్పు" అన్నాను ముక్తసరిగా.

"నాయందు దయుంచండి సార్! చెప్పబోతున్నాను" అంది.

అయ్యా మిగిలిన నా కొడుకుతో ఆ మురికి హుస్సేన్‌సాగర్ నుండి బయటపడే అవకాశం కోసం కరెంటుస్తంభాల మొదళ్లలో ఎదురుచూడగా చూడగా ఓ రోజు అవకాశం చిక్కింది.

ఓ దంపతులు ఖరీదైన కారులో వెళ్తూ హుస్సేన్‌సాగర్ చూసి ముగ్ధులై రోడ్డుపక్క కారాపి తమకంలో ఇద్దరూ నడుం మీద చేతులు వేసుకొని అలలమీదుగా వస్తున్న దుర్గంధం కలిసిన చల్ల గాలిని సేవించే తరుణంలో కార్ డోర్ వేయడం మరిచారు.అదే అదనుగా నేనూ, మా వాడూ అందులో చొరబడిపోయాం.

బంజారాహిల్స్‌లో ఓ పెద్ద భవంతి ముందు చిన్నపాటి గార్డెన్‌లో కారాగింది. కొంచెం తెలివిగా వాళ్లు దిగేలోపే చెంగున ఎగిరి బయటపడ్డాం, బతికిపోయాం. ఇక మా నివాసం కోసం రాత్రంతా కలయదిరిగాం. ఆ తోట నచ్చింది. అనేక రకాల చెట్లు, పూల మొక్కలు, నీటివసతి కల్గివున్న ప్రాంతం దొరికిందని సంబరపడ్డాం.

రెండు రోజులకు మాకు మరో అవకాశం దొరికింది. మా యజమాని ఇంటి పక్క ఓ పెద్ద ఫైవ్‌స్టార్ హోటలుంది. దాని చెత్తా చెదారం పోయే డ్రైనేజీ మా యజమాని కాంపౌండు వాల్ పక్కనుండే వెళ్తుండేది. అక్కడక్కడా వున్న రంధ్రాల ద్వారా మేం ప్రవేశించాం. మాంచి నివాసం దొరికిందని సంబరపడ్డాం. అది కొంచెం భూమిలోపలికి వుండటంవల్ల మనుషుల కంట పడలేదు. లేకపోతే ఆ రంధ్రాన్ని మూసేవాళ్లే. ఇక మా జీవితం కొంతసేపు డ్రైనేజీలో, కొంతసేపు తోటలో చెట్లకింద. వెన్నెట్లో పురుగులు, డ్రైనేజీలో జలకాలు. నచ్చినంతసేపు నచ్చిన దగ్గర. ఇలా కొంతకాలం సాగింది సార్.

నాకో చిన్న సందేహం కప్పాజీ! "మీరు అసలు విషయం చెప్పడానికి ఇంకెంతసేపు పట్టొచ్చు?" అన్నాను కొంచెం చిరాకుతో.

"క్షమించాలి డాక్టర్! విషయం కూలంకషంగా మీకు అర్థమవుతే నాకు సలహా ఇవ్వటానికి మీకేమీ ఇబ్బంది వుండదని. తన చమత్కారానికి 'బెకబెక' మనుకుంది తనలో తానే.

ఇక తప్పేట్టు లేదు. 'సరే చెప్పు చెప్పు అని' స్టూలు కాళ్లకిందికి లాక్కుని కాళ్ళు చాపుకున్నాను.


చెంగున ఎగిరి కప్ప నా టేబుల్ మీదికి వచ్చింది. 'అక్కడే వుండి చెప్పొచ్చుగా' అన్నాను కాస్త కోపంగా.

"ఇది రహస్య ఘట్టం డాక్టర్‌గారూ! నా కప్ప జాతిలో ఎవరైనా వింటే ఇక పుట్టగతులు వుండవు.కనుక ఇలా దగ్గరికి వచ్చి చెప్పాల్సి వస్తుంది".

"సరే చెప్పండి కప్పాజీ"

"డాక్టర్! ఈ మధ్య కొంత కాలంగా నా ఆరోగ్యం బాగుండక తోటలోనే వుండిపోతున్నాను. హోటల్ డ్రైనేజీలోకి వెళ్లడం మానేశాను. ఆ ఆహారం నాకు పడటంలేదు.నాకొడుకు మాత్రం తోటలోకి రావటం తగ్గించి అక్కడే ఎక్కువ కాలం గడపటం ప్రారంభించాడు.

వానికి దోస్తులు ఎక్కువయ్యారు. రోజూ తోటలోకి వచ్చి పడుకునేవాడు. ఈ మధ్య సరిగా రావటం లేదు. ఎపుడో గుర్తొచ్చినపుడు వచ్చిపోతున్నాడు. ఒళ్లు చేశాడు. గొంతు మారింది. అయ్యా! అన్నింటికంటే ఘోరం మా తరతరాల కప్పల జాతిని కించపరిచే వ్యవహారం, మా పూర్వీకులను అవమానపరిచే, అబ్బురపరిచే విషయమేమిటంటే నా కొడుకు కప్పకు



ఏమయిందో ఏమో ఈ మధ్య 'బెకబెక' మనటం మాని 'ఐటి ఐటి' అంటుండు నాయినా" అని భోరుమని ఏడ్చింది.

నాకేం అర్థం కాలేదు.

'ఐటి ఐటి'ఏంటి? అన్నాను.

"ఏమో నాయినా? అది తెలిస్తే నీ దగ్గరికెందుకొస్తాను నాయినా" అంది ఏడుస్తూనే.

కథ

నేను ఆలోచనల్లో పడ్డాను.

కాసేపు ఏడ్చి 'బెకబెక'మని కన్నీళ్లు రాల్చుకుని "అయ్యా! నడుస్తూ 'ఐటి ఐటి' అంటుండు. నవ్వుతూ 'ఐటి ఐటి' అంటుండు. ఆడుకుంటూ, గెంతుకుంటూ 'ఐటిఐటి' అంటుండు. 'బెకబెక'మని మరిచిపోయిండు నాయినా! చెపితే విడ్డూరం కాని వాని అపాన వాయువు కూడా "ఐటి ఐటి" అనేవస్తుంది నాయినా!"అని భోరుమంది.

నాకు ఫెళ్లున నవ్వాగింది కాదు.

చాలాసేపు నవ్వాను. కప్ప ఏడుస్తూంది.

కొంతసేపటికి "నా బతుకు ఇట్లా నలుగురిలో నవ్వులపాలు చేస్తుండు నాయినా నా కొడుకు. 'ఐటి ఐటి' అని అరుస్తుంటే మా కప్పల పెద్దలు వీనికేదో రోగం తగిలిందని, ఎవరికైనా మంచి డాక్టరుకు చూపమని సలహాలిస్తున్నారు. కొందరేమో వీనికేదో పిచ్చిపట్టిందని లోపల్లోపల సణుగుతున్నారు.

కన్నతల్లి కడుపు ఊకుంటుందా నాయినా! మావాన్ని పిలిచి బుజ్జగించి "నాయినా మనం కప్పలం. మన జాతి చాలా గొప్పది. మన గురించి సుమతి శతకంలో గొప్ప పద్యం రాశారు. మనుషులు మనల్ని చూసి చాలా నేర్చుకున్నారు. మన పూర్వీకులు చాలా గొప్పగా జీవనదుల్లో జీవించారు. మన దరిద్రంకొద్దీ మనం డ్రైనేజీల్లో బతుకున్నాం కానీ మన చరిత్ర తక్కువదేం కాదురా! నీవు మన జాతి మంత్రం "బెక బెక" వదిలి 'ఐటి ఐటి' అంటావేం రా!" అని నెమ్మదిగా చెప్పినా పట్టించు కోవటం లేదు నాయినా. గెంతుకుంటూ 'ఐటి ఐటి' అని వంకరగా డ్రైనేజీలోకి పోతూనే వుంది" అంది.

నాకు కొంత అర్థమయింది కప్పాజీ! ఈ మధ్య హోటల్లో ఏమైనా మీటింగులు జరిగాయా?" అని ప్రశ్నించాను.

"మీటింగులకేం నాయినా రోజు తప్పించి రోజూ జరుగుతూనే వున్నాయి. కొత్తగా కుర్రవాళ్లు తాగి తందనాలాడే పబ్, డిస్కోథెక్‌లు కూడా ప్రారంభించారు. కోడికూసే రాత్రి దాకా తాగటం, తినటం, ఎగరటం. డ్రైనేజీ నిండా కొత్త కంపు. రకరకాలుగా మునిగి మరిగిన మైల. వాటన్నిటినీ తట్టుకోలేకనే నాయినా నేను తోటలోనే వుండిపోతున్నాను.

ఇక ఈ మధ్య విదేశాల నుండి మన దేశం నుండి కొత్త కొత్త కంప్యూటర్ చదువులు చదివిన వాళ్ళంతా ఈ హోటల్లోనే వుండటం. ఇక్కడే మీటింగులు, సెమినార్లు పెట్టుకుంటున్నారు.ఎప్పుడూ ఏదో పండు గొచ్చినట్టు కొత్తబట్టలు, టైలు, సూట్‌కేసులు, బ్యాగ్‌లు ఏమో నాకేం అర్థం కాలేదు సార్ ఆ మనుషుల వ్యవహారాలు. పగటిపూట ఇట్లా వుంటుంది. రాత్రి పూట తాగి తాగి, ఆడి, కక్కి, ఏరిగి మా నివాస ప్రాంతాలను కంపు కంపు చేశారు.

ఏవో కొత్త లోకంలోకి తీసుకుపోతున్నారట వాళ్లంతా. హోటల్ గార్డెన్‌లో ఆ పెద్ద మనుషులందరూ మాట్లాడుకుంటుంటే విని మావాడు "కొత్త లోకం" కొత్త లోకం" నేను కూడ పోత అంటున్నాడు నాయినా!"

అయ్యా! ఇక్కడి గాలి, ఇక్కడి నీరు, ఇక్కడి బతుకులు, బంధాలు వదిలి, వాడు నడమంత్రపు మోసగాళ్ళ మాటలు, వేశాలు, నమ్మి ఖరాబయ్యాడు సార్! చెవులారా విందామంటే ఒక్కసారి గూడా వాని నోటివెంట 'బెకబెక' మంటలేదు. కప్ప ఏడుస్తూ వుంది. నాకు ఏం చేయాలో తోచలేదు. మధ్య రాత్రి దాటింది. ఆకలి, నిద్ర అన్నీ ఎగిరిపోయాయి.

కొడుకు కప్పలో మార్పు తల్లి కప్ప జీర్ణించుకోలేకపోతుంది. కొత్త జీవితం కోసం కొడుకు వెళ్లిపోవాలనుకోవటం తల్లి కప్పకు మనసంగీకరించడం లేదు.



ఆ 'ఐటి కప్ప'ని చూడాలన్పించింది. మాట్లాడాలన్పించింది. 'కప్పాజీ! రేపో సారి నీ కొడుకును తీసుకురా. అతన్ని పరీక్షించి మాట్లాడి ఏదైనా పరిష్కారం చెప్తానన్నాను. కప్ప ఆనందంగా ఒక గెంతు గెంతి "సార్! చాలా సంతోషం. రేపటిదాకా ఎందుకు. బయట వుంచే వచ్చాను మా వాడ్ని. పిలుస్తానంటూ డోర్‌వైపు గెంతింది. ఇప్పటితో ఆపుదామనుకున్న నాకు వీలుకాలేదు. అంతా ప్లాన్డ్‌గా వచ్చింది కప్ప. కొడుకును తీసుకుని రానే వచ్చింది.

'ఐటి ఐటి' అంది కొడుకు కప్ప లోపలికి రాగానే.

'వెధవ్వేషాలు ఆపు డాక్టరుగారి దగ్గర' తల్లి కప్ప కసిరింది.

'హాయ్‌య్‌య్...' అని విష్ చేస్తూ కొడుకు విచిత్రంగా తలవూపాడు.

'హాయ్' అన్నాన్నేను.

'ఐటి ఐటి' అంటూ మరో చోటుకి గెంతింది కొడుకు కప్ప.

'ఒక్క చోట వుండలేవురా' తల్లి కసిరింది.

'ఏంటి మాం. ఇదంతా టైం వేస్టు. ప్రపంచమంతా కంప్యూటర్ లోకంలోకి పోతూ వుంది. ది గ్రేట్ అమెరికా, బ్రిటన్, రష్యా, ఇలా అనేక దేశాలు పోటీలు పడి కొత్త లోకంలోకి పరుగెడుతున్నాయి. మనదేశంలో ఇప్పుడిప్పుడే వాళ్ల తోకలు పట్టుకొని ప్రయాణాలు సాగిస్తూ వున్నారు. నేను కూడా కొత్త లోకంలోకి వెళ్తాను. పాత చింతకాయ పచ్చడి, మురికికుంటలు, కుళ్లిన చెట్లమొదళ్లు, బండ రాళ్లు వదిలి ఫ్లేవర్డ్ డ్రైనేజీల్లోకి రా. ఇంకా అక్కడ్నుంచి ప్రపంచపు వీధుల వెంట విహారం చేద్దాం రా! 'బెకబెకలు ఇక ఇకలు పక్కకు పెట్టు. "ఐటి ఐటి" మన నినాదంగా, ఊపిరిగా చేసుకోవాలి. నేను అలాగే నడుస్తాను. నీకు ఇష్టమైతే రా. లేదా ఇక్కడే చావు. అంతేకాని ఇలాంటి ఓల్డ్ ఐడియాస్ డాక్టర్లతో నాకు నీతి పాఠాలు బోధించడానికి తీసుకురావద్దు.

"ఒరే ఒరే 'బెక బెక నా పరువు తీస్తున్నావు కదరా! పెద్దాయన్ను బతిమిలాడి, క్లినిక్ మూసుకునే సమయంలో ఆపినందుకు కృతజ్ఞతలు చెప్పాల్సింది పోయి అవమానపరుస్తావా బెకబెక"

"ఐటి ఐటి" నన్ను ఎందుకు తీసుకొచ్చావో పసిగట్టలేననుకున్నావా? నన్నేదో మార్చటంకోసం కదూ! అది ఎవరివల్లా కాదు. నేను తొందర్లోనే కొత్త లోకానికి చేరుకుంటాను 'ఐటి ఐటి'

'నిన్ను బంజారాహిల్స్‌కు తీసుకురావటం నా బుద్ధి తక్కువైందిరా! ఈ హోటల్ డ్రైనేజీ నీజీవితాన్ని బుగ్గిపాలుచేసిందిరా! ఎవడన్నా మంత్రాలేసినాడురా! బెకబెక"

"అవునే 'ఐటి ఐటి'. అమెరికావాడూ మంత్రం వేసిండు. ఇక ఎవరూ ఏం చేయలేరు. ఈ డాక్టర్లెంత? అని పకపక నవ్వుకుంటూ గదిలో ఆగకుండా విచిత్రంగా గెంతడం ప్రారంభించింది.

"చూశారా డాక్టర్‌గారూ! గెంతడంలో కూడా మా జాతి లక్షణాన్ని వదిలి పాశ్చాత్య గెంతడాలు నేర్చుకుంది. ఇంతకంటే మరణం మరొకటేముంటుంది నాయినా!" దుఃఖంతో బెకబెకమంది తల్లి కప్ప.

'సారీ డాక్టర్‌గారూ! మీరు మరెవ్వరికైనా నీతి ట్రీట్‌మెంటివ్వండి. నాలాంటి ఐటి తరానికి మాత్రం కాదు. ఐటి తరం చాలా గొప్పది. ప్రపంచాన్ని మార్చేసే తరం మాది. త్వరలో నేను కొత్త లోకం వెళ్ళబోతున్నాను. ఆ తర్వాత తెలుస్తుంది నా తడాఖా. వస్తా! బై పూర్ అన్డ్ ఓల్డ్ మాం 'ఐటి ఐటి' 'ఐటి ఐటి'. అంటూ నడుచుకుంటూ, గెంతుకుంటూ వెళ్లిపోయింది.

"కప్పాజీ మీవాడికి చాలా రోగం ముదిరినాక తీసుకువచ్చారు" అన్నాను. ఇక నేనేం చెప్పగలను?

"సారీ డాక్టర్‌గారు మళ్లెప్పుడైనా కొత్త బాధ కల్గితే చెప్పుకోవడానికి వస్తా. దయుంచండి బెక బెక" అంటూ బయటకు గెంతింది.

ఇక క్లినిక్‌లోనే కాళ్లుజాపి కళ్లుమూసుకున్నాను.

కలలు...ఐ...టి...క...ల...లు.

## 'ధారణ' ముఖ్య లక్షణం!

'ధారణ' అంటే మనసును ఒక చుక్క మీద నిలుపటం. దీనిని యోగశాస్త్రంలో 'ధారణ' అంటారు. . మనోవృత్తులను ఏదేని వస్తువుపై నిలపటం, మనస్సును, మనోవృత్తులను ఒక వస్తువుపై కేంద్రీ కరించి, కదలక మెదలక వుండే స్థితే ఇది. ధారణ నుంచి ధ్యానం కలుగుతుంది. ధారణ ముఖ్య లక్షణం అచంచలత్వం. దాని సారాంశము చంచలత్వాన్ని నశింపజేయుటయే. దాని ప్రత్యక్ష రూపం కదలిక లేకుండటయే. సంతోషము గలవారి మనస్సు నిలిచి వుండును. సౌఖ్యము లేక ఆనందమే దాని కారణం. ధారణవల్ల సౌఖ్యం, సమత్వం, పరవశత కలుగుతాయి.

ధ్యానాభ్యాసంలో నీవు నియమాన్ని అనుసరించవలెను. నీవు ప్రతి దినం ఉదయ సాయంత్రాలలో ఒకే సమయాల్లో ధ్యానానికి కూర్చుండవలెను. అప్పుడు ధ్యానభావం లేక సాత్త్విక భావం ప్రయాస లేకుండానే దానంతటది అలవడును. నీవొక గదిలో ఒకే స్థలమందు కూర్చుండవలెను. ధ్యానంలో నియమమే ముఖ్యమైన, అవసరమైన విషయమై వున్నది. అభ్యాసకుడు అట్టి నియమంతో వని చేసిన తొందరగా గొప్ప ఉత్తీర్ణత పొందవచ్చును. నీ అభ్యాసంలో నీకు సరియైన ఫలితంకనిపించక పోయినను, నీవు నమ్మకం, ఆసక్తి, ఓర్పు, పట్టుదల మొదలగువాటి సహాయంతో కృషి చేస్తుండాలి. కొంతకాలమైన పిమ్మట నీవు సరైన జయమును పొందగలుగుదువు. దీనిలో ఎలాంటి సందేహమూ అవసరం లేదు. నీవు ఒక్క దినమైననూ యెట్టి జబ్బు, ఇతర ఇబ్బందులు కలిగిననూ ధ్యానాభ్యాసాన్ని ఆపివేయకూడదు. ధానం మంచి మొదటి రకపు మందు. ధ్యానం యెట్టి జబ్బునైననూ నిర్మూలింప సామర్థ్యం గలది.

**ఆధ్యాత్మిక పథం**



స్వామి శివానంద సరస్వతి

అది ఆధ్యాత్మిక బలాన్ని, కొత్త చురుకుదనాన్ని, శక్తిని మనకు కలిగించును. అది శరీర పరిస్థితి వివిధదశలను పూర్తిగా పరిశోధించి, వాటికి కొత్త జీవితాన్ని కలుగజేయును. నీవు సాత్త్విక పరంపర లేక ధ్యానపద్ధతిని అలవరచుకొనుటకు చురుకుగా ఉండాలి. ధ్యానస్థితి నీకు కలిగినప్పుడు ఏ పనిచేస్తున్నా, చదువుతున్నా వాటిని మాని వేయాలి. తక్షణం మనఃస్ఫూర్తిగా ధ్యానానికి కూర్చుండుము. గర్వం, అతి గర్వం, అహం, తన గొప్పతనం నందలి రాజస స్వభావం, కోపం, ఇతరుల విషయాలను తెలుసుకోవాలన్న ఆసక్తి, కృత్రిమ బుద్ధి లేక కపటం ఇవన్నీ ధ్యానానికి అడ్డంకులు. ఈ మార్గం సూక్ష్మ వాసనలు మనస్సునందు దాగి యుండును. అవి సముద్ర గర్భమందుండే జల ప్రవాహం వలె పనిచేస్తాయి. ఒక గదిని ఆరు మాసములు మూసిపెట్టి తరువాత తెరచినచో ఎంత మలినముతో కూడియుండునో, అట్టి గదిని మనం శుభ్రము చేసిన మలిన మంత యు పోయి ఎట్లు శుభ్రమగునో, ఆ ప్రకారమే మనస్సు నందు గల మాలిన్యములన్నీ యోగం, ధ్యాన బలాలవల్ల పూర్తిగా పోతాయి.

అలాగే, గర్వం ఒక అడ్డంకిగా మనోదృష్టిని చెదరగొడుతుంది. కనుక సాధకుడు తన తప్పులను తొలగించుకొనుటకు ప్రయత్నించాలి. అట్టివాడే ఆధ్యాత్మిక జ్ఞానం, ధ్యానాలలో వృద్ధి పొందును.

('జీవన సాఫల్యానికి, దైవసాక్షాత్కారానికి నిశ్చిత మార్గం' గ్రంథం నుండి...)